

# కొన్ని జ్ఞాపకాలు.. ఒక కన్నీటి చుక్క

'పిడికిట్లో గాలి ప్రేమ

ఉందంటే ఉంది.. లేదంటే లేదు'

డాక్టర్ శరత్‌చంద్ర ఎందుకో తనకు తెలియకుండానే చేతిలోని పెన్నుతో.. ఎర్రని సిరాతో ఆ రెండు పంక్తులను అండర్‌లైన్ చేసి.. అప్పటిదాకా చదువుతున్న ఆ కవిత్వ పుస్తకం 'మూడు స్వప్నాలు – ఒక మెలకువ'ను మూసి గాఢంగా నిట్టూర్చి సోఫాలో వెనక్కి వాలి కళ్ళు మూసుకున్నాడు .

ప్రేమ కనబడదు. గాలి కనబడదు. మనుషుల మధ్య బంధాలు కనబడవు. అంతరిక్షాన్ని ఆవరించి ప్రపంచాన్ని శాసిస్తున్న అనేకానేక అదృశ్య తరంగాలేవీ కళ్ళకు కనబడవు. కన్నీళ్ళు కనబడవు. కాని ప్రభావాలు కనబడ్తాయి. వినబడ్తాయి. దుఃఖాలుగా, సంతోషాలుగా, అనుభూతులుగా, వెంటాడే జ్ఞాపకాలుగా, మరపురాని అనుభవాలుగా, చివరికి మాసిపోకుండా మిగిలే మరకలుగా.

'A lamp does not speak
It introduces itself through it's light –
Achievers never expose themselves
But their achievements expose them'

మనసు చటుక్కున కలకత్తాలోని కాలేజ్ స్ట్రీట్‌లోకి వెళ్ళిపోయింది. నలభై ఏళ్లక్రితం బిజన్ బుక్‌స్టాల్‌లో.. కొన్న 'గ్రేట్ ఐడియాస్ అండ్ ఎక్స్‌పీరియెన్సెస్' అన్న నాలుగణాల పుస్తకంలో చార్లెస్ డికెన్స్ చెప్పిన ఆ మాటలు జ్ఞాపకమొచ్చి.. మనసంతా భారమై.. మబ్బు పట్టిన ఆకాశం వలె,

వెళ్ళిపోవాలి. తక్షణమే ఈ రోజే తననుకున్న విధంగా కలకత్తాకు వెళ్ళి.. తనకు ప్రాణసమానమైన ఆ 'కాలేజ్ స్ట్రీట్' పరిసరాలను, ట్రాం పట్టాలను, తరతరాలుగా మనుషులను ఒకానొక అదృశ్య మేథోబంధంతో జోడించి బంధించి 'పుస్తకం' అన్న మహాయుధంతో ఏడెనిమిది తరాలను తన అమృతహస్తాల మధ్య పొదువుకుని జ్ఞానసంపన్నులను చేసి ప్రపంచంలోనే అతి పెద్ద 'సెకండ్ హ్యాండ్ పుస్తక విక్రయ స్థలం'గా పేరు ప్రఖ్యాతులు పొందిన ఒకటిన్నర కిలోమీటర్ పొడవైన పుస్తక రాస్తా.. అక్షర పరిమళ క్షేత్రం.. విద్యా వినిమయ కేంద్రం.. ఎందరో మహాపురుషులు, ఋషితుల్యులు, సాహిత్యవేత్తలు నడయాడి పావనం చేసిన పుణ్యభూమి.. గాలినిండా ఒక్క 'విద్య, జ్ఞానం' తప్ప ఇంకేదీ వినబడని, కనబడని దివ్యస్థలి.. వెళ్ళాలి.. చదువులతల్లి ఒడిలోకి శిశువులా, సముద్రంలోకి వడివడిగా నడీచే నదిలా, తడి నేలలోకి విత్తనంలా, ఒక తరగతి గదిలోకి మొదటిరోజు అడుగుపెడుతున్న పసి విద్యార్థిలా.. వెళ్ళాలి.

తహతహ లోపల.. ఉత్సుకత.. భాషకందని ఉద్విగ్నత.. ఎన్నో ఏండ్లుగా విడిచి వెళ్ళిన తల్లిని మరణశయ్యపై దర్శించబోతున్న దుఃఖపూరిత నిస్సహాయ విషాదం.

కాలం ఒక్క ముందుకే కాదు.. అప్పుడప్పుడు ఆగి, స్తంభించి, లోలకంలా ఊగి ఊగి వెనక్కి ఇంకా వెనక్కి కూడా పునర్యానిస్తూ,

వ్యాకులత.. విమోహ మోహ వ్యామోహం.

సరిగ్గా ఆ క్షణమే అతని ప్రక్క టీపాయ్ పైనున్న మొబైల్ మోగింది.

తెలుసతనికి ఆ ఫోన్ ఎవరిదో.. అపర్ణ.. ప్రొఫెసర్ అపర్ణ.

"హలో.." అన్నాడు.

"ఇంకో ఐదు నిముషాల్లో అక్కడుంటాన్నేను."

"వెల్కం."

గడియారంలోకి చూశాడతను అనాలోచితంగానే. రాత్రి.. మూడుగంటలు సరిగ్గా.

ఐదు గంటల పదిహేను నిముషాలకు తమ ఫ్లైట్.

తను.. 1949వ సంవత్సరంలో పుట్టినవాడు. అప్పుడప్పుడే భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చి పాకిస్తాన్ భారత్ విభజనతో అత్యంత భీకరమైన మత చాదస్తానికి లక్షలమంది ప్రజలు బలై ఈ పుణ్యభూమి రక్తసిక్తమై అప్పుడప్పుడే కొత్త వెలుగు రేఖలు ఈ నేల నలుచెరగులా విస్తరిస్తున్నప్పటి స్వాతంత్ర్యానంతర తరం. భారతదేశపు మొట్టమొదటి జనరేషన్ తమది.

మనుషులలో ప్రాణం కన్నా విలువలు మిన్న.. మాట మిన్న.. నైతిక జీవితం మిన్న అన్న రోజులవి.

పోస్ట్‌మాస్టర్‌గా పనిచేసే నాన్న.. హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో తనను చేర్పించి.. ఇక ఉన్నత విద్యకోసం దూరపు తీరాలవైపు దృష్టిని సారించి.. మనిషిని మనిషిగా తీర్చిదిద్దగల వ్యవస్థను అన్వేషిస్తున్న కాలంలో,

నాన్న దృష్టి బెంగాల్ వైపు మళ్ళి,

రవీంద్రుని శాంతినికేతన్.. వారణాసి, హిందూ బనారస్ యూనివర్సిటీ.. 1817లో స్థాపించబడిన కలకత్తాలోని హిందూ స్కూల్ వైపు చూపు.

ఎటు చూచినా 'ఈ దేశం నాది.. ఈ ప్రజలు నా వారు.. ఈ జీవితం నా దేశం కోసమే.. పవిత్రమైన నా జన్మభూమి కోసమే నా సర్వస్వం' అన్న భావనతోనే విద్యా వ్యవస్థ రూపొందించబడి బోధించబడేది విద్యార్థులకు.

అప్పుడు తీసుకున్నాడు తను అడ్మిషన్.. అప్పటి భారత సంస్కృతి ప్రేమికులైన బ్రిటిష్ అధికారులు చీఫ్ జస్టిస్ ఎడ్వర్డ్ హైడ్ ఈస్ట్ మరియు డేవిడ్ హేర్‌ల సారథ్యంలో బాబు బుద్ధినాథ్ ముఖర్జీ చేత స్థాపించబడిన 'హిందూ స్కూల్'లో.

ఆనాడే మొట్టమొదటి ప్రవేశం.. కాలేజ్ స్ట్రీట్‌లోకి. నాన్నా, అమ్మా తనను ఒక బెంగాల్ టీచర్ హరీంద్రనాథ భట్టాచార్య ఇంట్లో పేయింగ్ గెస్ట్‌గా ఉంచి వెళ్ళిన సాయంత్రం,

మొట్టమొదటిసారిగా ట్రాం ఎక్కడం.. 'మల్లిక్ బుక్ హౌజ్'లో తన ఇంటర్మీడియెట్ సెకండ్ హ్యాండ్ పుస్తకాలను సగం ధరకే కొనడం.. తర్వాత

తన క్లాస్‌మేట్ సుభాష్ చంద్ర చటర్జీతో తొలిసారిగా చారిత్రాత్మకమైన 'ఇండియన్ కాఫీ హౌజ్'కు వెళ్ళి వన్ బై టు కాఫీ తాగడం. అప్పుడు స్థానికుడే ఐన సుభాష్ చంద్ర "అదిగో అటు చూడు.. ఆ మూలనున్న చెక్క కుర్చీ.. దానిపైననే మన విశ్వకవి రవీంద్రుడు ఈ కాఫీ హౌజ్‌కు వచ్చిన ప్రతిసారీ ఇష్టపడి కూర్చుని తన మిత్రులతో గంటల తరబడి ముచ్చటిస్తూ గడిపేది" అని చెప్పినపుడు.. వెళ్లేప్పుడు.. దగ్గరగా వెళ్ళి ఆ ఖాళీ కుర్చీని చేతులతో తడిమి.. ఒక పులకింత.. ఒక పారవశ్యం.

ఆ రోజు మొదలైన బెంగాల్ నేల సాహచర్యం అది.. చుట్టూ అన్నీ విద్యా సంస్థలే. అతి పురాతనమైన జ్ఞానాలయాలు. 1817లో స్థాపించబడ్డ ప్రెసిడెన్సీ యూనివర్సిటి, 1857లో ఏర్పాటుచేయబడ్డ యూనివర్సిటీ ఆఫ్ కలకత్తా, 1857 లోనే ప్రారంభించబడ్డ భారతదేశంలోనే మొట్టమొదటి కలకత్తా మెడికల్ కాలేజ్, సంస్కృత కళాశాల, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషియల్ వెల్ఫేర్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్.. హేస్ స్కూల్.. ఇలా గణేశ్ చంద్ర అవెన్యూ 'బావ్ పారా' చుట్టూ అన్నీ విశ్వ విఖ్యాత కాలేజీలే. అందుకే అది కాలేజ్ స్ట్రీట్.. అంతా పుస్తక ప్రపంచం.. జ్ఞానలోకం.. సూర్యసేన్ రోడ్ నానుకుని ఒకటిన్నర కిలోమీటర్ల నిడివి.. ఎన్ని కుటుంబాలో.. ఎన్ని తరాల వ్యక్తులో, ఎన్ని దుకాణాలో, ఎన్ని భాషలవాళ్ళో, పుస్తకాలు అన్నీ పాతవి.. ఇంకా పాతవి.. వందల ఏళ్ల కిందివి.. కొత్తవి.. సరికొత్తవి.. ఎక్కడా లభించనివి.. ఈ దేశానివి.. ఏ దేశానివైనా.. ఏ రంగానివైనా, మెడికల్, ఇంజనీరింగ్, సాహిత్యం, శాస్త్ర రంగాలు, కళలు, తాత్విక, మంత్ర, తంత్ర, ఆయుర్వేద, ఆధ్యాత్మిక, నాట్య.. ఏ రంగమైనా,

శరత్ తనను కోల్పోయి తొలినాటి జ్ఞాపకాల్లో కొట్టుకుపోతున్న ఆ క్షణం.. బయట కారు ఆగిన చప్పుడై.. బయట తన కుక్క టఫ్ఫీ భౌ మని అరిచిన శబ్దం వినబడి,

లేచాడు సోఫాలోనుండి.

ఎదురుగా మెట్లపైన గంభీరంగా .. భార్య రేవతి పటం కనబడింది. దాన్ని తన బెంగాల్ మిత్రుడు అమర్త్యసేన్ గీశాడు ఒకసారి అతిథిగా వచ్చి ఓ వారం రోజులు తమింట్లో ఉన్నపుడు.

రేవతి ఎప్పుడు చూచినా అప్పుడే విరిసిన కలువ పువ్వులా ఉండేది. తనకు బెంగాల్‌లో ఉన్నప్పుడే పరిచయమైందామె. వారణాసికి చెందిన బ్రాహ్మణ అమ్మాయి.

శాంతినికేతన్‌లో ఎమ్మే ఇంగ్లీష్ చేసింది. హిందుస్తానీ మ్యూజిక్‌లో డిప్లొమా చేసింది. కళ్ళు మూసుకుని రాత్రి సితార్ వాయిస్తూ పాడుతూంటే వెన్నెలలు కురుస్తూ.. నక్షత్రాలు సన్నజాజి పువ్వులై రాలుతున్నట్టుండేది. జీవితంలో ఈ దాంపత్య అనుభవం కంటే ఇంక ఏ సుఖమూ అవసరం లేదన్నంత పరిపూర్ణ తృప్తి మిగిలేది.

కాని వెళ్ళిపోయింది అకస్మాత్తుగా.. రాధికను తనకిచ్చి.. పదేళ్లు కాగానే హడావిడిగా దేవుడు పిలుస్తున్నట్టే ఇక సెలవని నిష్క్రమించింది.

ఒక ప్రఖ్యాత సర్జన్‌గా, తర్వాత్తర్వాత ఒక సూపర్ స్పెషాలిటీ వైద్యుడైన 'కార్డియో థొరాసిక్ సర్జన్'గా ఎదిగి.. భారత అనువంశిక చింతనలో, పురాణాల్లో, ఇతిహాసాల్లో ప్రస్తావించబడ్డ అనేకానేక వింత ఘటనలైన.. గణపతి వంటి పురాణ పాత్రల శిరోఖండన తర్వాత ఒక నియమిత సమయంలో మరో శిరస్సును అమర్చినచో అది సజీవంగా అతికి శాశ్వతంగా పనిచేయుట.. అలాగే తుంబురుడు, శుకుడు వంటి పాత్రలు మానవ శిరస్సులకు బదులు అశ్వముఖాన్నీ, శుకముఖాన్నీ కలిగి ఉండుట.. ఐనా వాళ్ళు విద్వత్తుతో అసాధారణ ప్రతిభతో వర్థిల్లుట.. శరీరధారులైన దేవదానవులు అభౌతిక ధారణలతో అదృశ్యమైపోవుట.. కావలసినపుడు ప్రత్యక్షమై కనిపించుట.. శపించుట.. వాక్కు.. వాక్ శుద్ధి.. వరాలు.. అవి నిజమగుట.. వీటిపై అనేక పరిశోధనలు చేస్తున్న తను ప్రపంచాన్ని విభ్రాంతి పరుస్తున్న ఫలితాలను సాధిస్తున్న తరుణంలో.,

ఒంటరితనం.. ఏకాకితనం.. ఏ సాహచర్యమూ లేని ఏకీకృత పోరాటం.

పరిశోధనలు.. అధ్యయనాలు.. ప్రయోగాలు.. తపస్సమాన అన్వేషణలు.. ఇవే జీవితమై,

ఈ ప్రయోగాలన్నీ.. ఇంట్లోని ప్రయోగశాలలో.. ఆస్పత్రిలోని ప్రత్యేక వసతుల్లో కొనసాగిస్తున్న దశలో.. వెంట నీడై తోడై ఉన్నది రేవతే. తన ప్రతి అడుగునూ సువ్యవస్థితంగా వేయడానికి కారకురాలూ, ఉత్తేజమూ రేవతే.

సరిగ్గా.. తను చదివిన కలకత్తాలోని జాతీయ వైద్య కళాశాలనుండే 1958లో పట్టభద్రుడైన డాక్టర్ సుభాష్ ముఖోపాధ్యాయ 1967లో ఇంగ్లండ్‌లోని ఎడిన్ బర్గ్ విశ్వవిద్యాలయం నుండి 'రిప్రొడక్టివ్ ఎండ్రోక్రోనాలజీ' మీద పి హెచ్ డి చేసి.. 'ఇన్–విట్రొ ఫర్టిలైజేషన్' (టెస్ట్‌ట్యూబ్ బేబి) విధానంతో 1978లో కృత్రిమ శిశువుకు జన్మనిస్తే.. అప్పటి దిక్కుమాలిన వైద్య రాజకీయాలవల్ల ఈ పరిశోధన

క్రెడిట్ రాబర్ట్ ఎడ్వర్డ్ మరియు పాట్రిక్ స్టెప్టోలకు దక్కి వాళ్ళకే నోబెల్ బహుమతి రావడం.. తర్వాత్తర్వాత డాక్టర్ సుభాష్ లోలోన కుమిలి కుమిలి జూన్ 19, 1981న ఆత్మహత్యకు పాల్పడడం.. ఆ ఉదంతాన్నే ప్రఖ్యాత సినీ దర్శకుడు తపన్ సిన్హా 'ఏక్ డాక్టర్ కీ మౌత్' అనే టైటిల్‌తో పంకజ్ కపూర్, షబానా ఆజ్మీలు నటులుగా సినిమా తీయడం.. ఒక సంచలనంగా అది మారి,

ఎన్ని అవరోధాలో మనిషికి ఒక వినూత్న విషయాన్ని కనిపెడుతున్నపుడు,

సుభాష్ ముఖోపాధ్యాయను తను నాల్గయిదుసార్లు కలుసుకోవచ్చు కాలేజ్ స్ట్రీట్‌లోని.. ఇండియన్ కాఫీ హౌజ్.. మొదటి అంతస్తు.. ఆ మూల ఠాగూర్ కుర్చీ దగ్గరే.

ముఖోపాధ్యాయ ముఖం స్ఫురించింది శరత్‌కు. అమాయకమైన కళ్ళు.. నిర్మలమైన దృక్కులు.. ముఖంనిండా ఏదో అర్థంకాని మేథో వర్చస్సు.

రేవతీ తానూ వెళ్ళారు ముఖోపాధ్యాయ మరణించినప్పుడు కలకత్తాకు.. ఎంత విషాదమో.. ఆ రాత్రి. అప్పటికే అనేక వైద్యశాస్త్ర సంబంధమైన అంశాలపై నమ్మశక్యం కాని ఫలితాలను సాధిస్తూ వైద్యరంగ శాస్త్రవేత్తలను విభ్రమ పరుస్తున్న తను.. చలించిపోయాడు బాగా.

ప్చ్.,

కారు తన విల్లా లోపలికి వచ్చి ఆగినట్టు శబ్దం తెలుస్తూ.. మొబైల్ కూడా మ్రోగి,

శరత్ టైం చూచుకొని గబగబా.. అప్పటికే సిద్ధం చేసుకున్న బ్రీఫ్‌కేస్‌ను తీసుకుని,

కిందకు రాగానే.. వెనుక డోర్‌ను తెరిచింది అపర్ణ. శరత్ ఆమె ప్రక్కనే కూర్చుని.. "గుడ్ మార్నింగ్ ..లేటయ్యింది.. డ్రైవర్.. ఏర్ పోర్ట్‌కు తొందరగా.." అంటూండగానే కార్ స్టార్టయి,

రోడ్‌పై.. మెరుపులా దూసుకుపోతూ,

"సారీ డాక్టర్.. కాస్త.." అని అపర్ణ అనబోతూండగానే,

"ఇట్స్ ఓ.కె.. అంత లేటేమీ కాదు.. వుయార్ వెల్ ఇన్ టైం.. బై ది బై హౌ ఆర్ యూ.." అని ఆమె ముఖంలోకి చూచి,

అరవై ఒక్క ఏడు వయసున్న అపర్ణ అప్పుడు తుడిచిన గాజుబొమ్మలా గంభీరంగా స్వచ్ఛంగా ఉంది.. ఒక చిరునవ్వు నవ్వింది జవాబుగా.

ఈ అపర్ణ ఎవరు.. తనెవరు.. అతి యాదృచ్ఛికంగా జరిగిన పరిచయం స్నేహమై.. ఆత్మీయతై.. ఈ అస్తమయ వేళ ఒక అసాధారణ సాహచర్యమై,

మనుషుల మధ్య ఒక తోడు, ఒక ఆసరా, ఒక చేయూత.,

అంతేనా.. భారతీయ చింతన ప్రకారం ఒకరికొకరు అన్న భార్యాభర్తల సంబంధానికి అతీతంగా కేవలం సాహచర్య బంధాన్ని కలిగి ఉండడం.. ఏమిటిది.. సమాజ దృష్టిలో.. సన్నిహితుల దృష్టిలో.. తమ అత్యంత ఆంతరంగికుల దృష్టిలో.. తామెవరు. స్నేహితులా. శ్రేయోభిలాషులా.. సహచరులా.. ఎవరు?

ఎందుకో అప్రయత్నంగానే అపర్ణ దిక్కు చూశాడు శరత్.

ఆమె.. కళ్ళు మూసుకుని ఏదో ధ్యానముద్రలో సమాధైపోయిన నిశ్చల స్థితిలో ఉంది. ముఖం నిండా వెల్లివిరుస్తున్న ప్రశాంతత.

'ఎప్పుడు చూచినా అప్పుడే వికసించిన మల్లెపూవులా స్వచ్ఛంగా, నిర్మలంగా ఎలా ఉండగలదీమె' అనుకుంటాడెప్పుడూ శరత్. ఒకసారి అదే మాట అపర్ణతో అంటే.. చిన్నగా నవ్వి 'రినౌన్సిఏషన్.. పరిత్యాగం శరత్.. ఒక్కో భౌతిక అభౌతిక కాంక్షనూ జయిస్తూ వెళ్తున్నకొద్దీ మనిషి క్రమంగా ఆత్మాన్వేషణ స్థితికి చేరుకుంటాడు. అప్పుడు అన్నీ ఉన్న స్థితి నుండి క్రమంగా ఏమీ లేని నిరామయ దశకు చేరుకుంటూ మనిషికి ఇన్నాళ్ళూ తెలియని ఒక మహత్తర ఆత్మానంద దశ ప్రాప్తమౌతుంది. అది స్థిరమైందీ, నిశ్చలమైందీ, శాశ్వతమైందీ కూడా. ఎప్పుడూ మనిషి తనంతట తాను మృత్యువును ఆహ్వానించి నిష్క్రమించలేడు కాబట్టి తప్పనిసరైన, అనివార్యమైన జీవితాన్ని గడుపుతూంటాడు మనిషి.. జీవితాన్ని జీవించడం కాదది. నిజానికి మీదికాని, నాదికానీ కోర్ పార్టాఫ్ లివింగ్ ఐపోయింది.. ఇప్పుడు సాగుతున్నది కేవలం కొనసాగింపు ప్రయాణమే.. నాన్ ప్రొడక్టివ్. అనుత్పాదక జీవితం. సాయం సంధ్య.'

ఆకాశంలోకి నిరామయంగా చూచినట్టు చూశాడు ఆమె ముఖంలోకి. ఒక్క క్షణం రోడ్ ప్రక్కనున్న ఏదో హోర్డింగ్ కాంతిలో అపర్ణ ముఖం తళుక్కున మెరిసి మాయమైంది.

ఆమే అంది మళ్ళీ.. "కొన్ని ప్రయాణాలు చిన్నవై ఉంటాయి. ముగించి

వెళ్ళిపోవడమే.. మరికొన్ని అలా కాదు.. సుదీర్ఘంగా, సంక్లిష్టంగా ఉంటాయి.. ఉదాహరణకు మీ పరిశోధనాత్మక జీవితం.. మానవాళి శ్రేయస్సు దృష్ట్యా మీరు కొన్నేళ్ళుగా నిర్వహిస్తున్న ప్రయోగాలు భవిష్యత్ తరాలకు ఎంతో మేలు చేసి ఉద్ధరిస్తాయి. మీ ఈ ప్రయోజకాత్మక జీవితం కొనసాగి ఫలవంతం కావాలి. అందుకే సమాజ సంపద ఐన మీలాంటి వ్యక్తిని కాపాడుకోవటంలో నాలాంటి వాళ్ళు సహకరించాలని..” ఆగిపోయింది అపర్ణ.

తర్వాత నిశ్శబ్దం.

నిశ్శబ్దం కూడా మాటలకంటే శక్తివంతంగా సంభాషిస్తుందని వాళ్ళిద్దరికీ తెలుసు. అనుభవం కూడా.

కారు అతివేగంగా పరుగెత్తీ పరుగెత్తీ.. శంషాబాద్ ఏర్‌పోర్ట్ చేరుకుని,

ఇద్దరు మనుషులు.. చెరో చేతిలో.. చిన్న హ్యాండ్‌బ్యాగ్స్. అంతే.

నాల్గూ యాభై.

సరిగ్గా ఐదూ పదిహేను నిముషాలకు ఫ్లైట్.. స్పైస్ జెట్.

అప్పుడు వాళ్ళిద్దరూ.. అత్యాధునిక మానవరూపాల్లో భూమ్మీదకొచ్చిన ఋషుల్లా ఉన్నారు.

చనిపోబోతున్న కన్న పిల్లవైపు అతి నిస్సహాయమైన తల్లి దీనంగా చూస్తున్నట్టు ఉంది శరత్ ముఖం.. చూపులు. జాగ్రత్తగా అతన్ని గమనిస్తోంది అపర్ణ కలకత్తా ఏర్‌పోర్ట్‌లో దిగినప్పటినుండి. కొన్ని దశాబ్దాల అనుబంధం శరత్‌ది కలకత్తాతో. చదువు, ఉన్నత పాఠశాలనుండి.. మెడిసిన్ వరకు.. డిస్టింక్షన్.. గోల్డ్ మెడల్.. తర్వాత ఎమ్మెస్.. సర్జరీ.. తర్వాత ఎయింస్‌లో.. కార్డియో థొరాసిక్ సర్జరీ.. కలకత్తా హస్పిటల్‌లో ఏండ్లకొద్దీ రోగుల సేవ.. హౌరా బ్రిడ్జ్‌పై వందల సాయంకాలాలు నిశ్శబ్ద నిరీక్షణ.,

మహమూద్ బుక్స్.. ముందు నిలబడ్డారిద్దరూ. చక చకా కొన్ని పేర్లు చెప్పాడు శరత్.. పాత పరిచయాలున్నట్టున్నాయి.. ప్రేమగా పలకరించి టకటకా ఓ ఐదారు పుస్తకాలనందించాడు.. పాతవి అన్నీ.. నోబుల్ ప్రైజ్ విన్నర్ సామ్యుల్ బెకెట్ పుస్తకం ‘వెయిటింగ్ ఫర్ గోడో’ అది.. పుటలు రంగు మారి.. అదో రకమైన ముక్క వాసన.. జేగురు రంగు కాగితాలు.. తడి, దుమ్ము, దశాబ్దాల కాలం, పాత

అట్ట తాలూకు ప్రాచీన పరిమళం.. చాలా ప్రేమగా ప్రతి పుటనూ తడుముతున్నాడు శరత్.. అకస్మాత్తుగా అన్నాడు.. "అపర్ణా.. బెకెట్ ఏమన్నాడంటే .. మై మిస్టేక్స్ ఆర్ మై లైఫ్.. అని. చాలా గొప్ప విషయం కదా."

ఆమె మాట్లాడలేదు. మౌనంగానే అతని ముఖంలోకి చూచి సన్నగా నవ్వి అతని చేతిలోని పుస్తకాన్ని తీసుకుని సంచిలో పెట్టింది. తను కోరుకున్న బొమ్మ దొరకగానే చిన్న పిల్లాడు పొందే ఆనందం శరత్‌లో.

"అడోబ్ ఫోటోషాప్ న్యూ ఎడిషన్ ఇవ్వు రఫీక్" అన్నాడు మళ్ళీ.

మరుక్షణం ఇచ్చాడతను ఏ మాత్రం తడుముకోకుండా. 1042 పేజీలు. 1600 రూపాయలు వెల. 800 తీసుకున్నాడు. పుస్తకాన్ని ముక్కు దగ్గర పెట్టుకుని చిన్నపిల్లాడిలా గాఢంగా గ్రాణించి.. "హౌ ప్లెజర్ ఫుల్" అన్నాడు స్వగతంలోలా. అపర్ణ ఆ పుస్తకాన్ని కూడా తీసుకుంది. అప్పుడే సర్రున గమ్మత్తైన శబ్దం చేస్తూ నడిరోడ్డుపై కదుల్తూ ట్రాం.. ఆగింది.. గజానన్ బుక్స్ స్టాప్. "పద పద" అని ఆమెను తోసుకుంటూ చేయి పట్టుకుని లాక్కుని ట్రాంలోకి ఎక్కి.. వేగం అందుకుని.. చుట్టూ జనం.. ప్రక్కనే జరుగుతున్న లావాదేవీలు.. అంతా కోలాహలం.. ఒక పెద్ద జనసందోహ జీవ వ్యవహారం.. 'మనుషులు ఒక చోట కలవడమే కవిత్వం కదా' అని ఎవరో అన్నట్టు,

సూర్యసేన్ రోడ్ అటు కొస,

ఒక అవశేషంగా మిగిలిన మనిషి లాగే రిక్షా.. ఒకడు కూర్చుంటే ఒకడు లాగేవాడు.. ఫ్యూడల్ వ్యవస్థ.

రోడ్ పైననే .. చిన్న చిన్న టీ స్టాల్స్.. చుట్టూ మనుషులు.. ఎక్కువగా స్టూడెంట్స్. వృద్ధులు.. తమ పాత పుస్తకాల కోసం వేట.

అప్పుడొచ్చింది.. ఆ ప్రాంతం.. 'ఇండియన్ కాఫీ హౌజ్'.

"రా.. అపర్ణా.. కం.. ఆ ఫస్ట్ ఫ్లోర్‌కు వెళ్దాం పద.. నీక్కొన్ని చూపించాలి.." లాక్కుపోతున్నాడు శరత్.

ఏమి ఉత్సాహమిది ఈయనకు ఈ కాలేజ్ రోడ్‌కు రాగానే.. అనుకుందామె.

'వుయార్ లక్కీ.. వుయ్ గాటిట్' అని చటుక్కున ఓ మూలనున్న పాత చెక్క కుర్చీని దగ్గరకు జరుపుకుని తను కూర్చుంటూ ఇంకొకటి అపర్ణకు చూపించాడు.

పైన పొడుగాటి ఇనుపరాడ్‌కు వ్రేలాడ్తూ.. పాత కాలపు పంఖా.. నిశ్శబ్దంగా తిరుగుతూ.

శరత్.. అప్రయత్నంగానే తను కూర్చున్న కుర్చీని ఆర్ద్రతగా స్పర్శిస్తూ తడమడం గమనించింది అపర్ణ.

"అపర్ణా.. ఈ చారిత్రాత్మక కాఫీ హొటెల్లో.. నేను కూర్చున్న కుర్చీలోనే రవీంద్రనాథ్ ఠాకూర్ కూర్చున్నారు ఒకప్పుడిక్కడ కాఫీ తాగుతూ.. ఆ కుర్చీలో సుభాష్ చంద్రబోస్.. ఇక్కడ సత్యజిత్‌రాయ్.. అక్కడ అమర్త్యసేన్.. మృణాల్ సేన్.. నువ్వు కూర్చున్న కుర్చీలోనే ప్రముఖ దర్శకురాలు అపర్ణాసేన్.. శశికపూర్. మన్నాడే ఒక అద్భుత బెంగాలీ గీతం పాడుతూ అన్నాడు 'కాఫీ హౌజ్ ఎర్ షి అడ్డా టి' అని.. 'మహాత్ములు ముచ్చట్లాడుకునే అడ్డా..ఈ చోటు.. అని.'

తెల్లని యూనిఫాం వేసుకుని నెత్తిపై టోపీతో ఒక బాయ్ వచ్చాడు.. తడుముకోకుండా.. ఆర్డర్ చెప్పాడు శరత్ "ఒక అఫ్ఘనీ చికెన్.. రెండు సమోసా.. రెండు కాఫీ.. అన్నీ ఒకేసారి" అని.

"మనం కనీసం రెండు గంటలన్నా ఉండాలి అపర్ణా ఇక్కడ" అన్నాడు చాలా అభ్యర్థనగా.. చిన్న పిల్లాడిలా.

బాగా గమనిస్తోందామె.. ఆ ప్రాంతంతో పెనవేసుకుపోయిన తన పాత స్మృతులను మననం చేసుకుంటూ శరత్ పరవశించిపోతున్నాడు. బేరర్ తమ ఆర్డర్‌ను తెచ్చేలోగా.. కొన్న పుస్తకాల సంచీని తీసి.. ఒక పుస్తకాన్ని చేతుల్లోకి తీసుకుని.. అట్టను తిప్పి చూస్తూ .. పైన రాసి ఉన్న పేరును తడిమాడు.

భవానీ భట్టాచార్య.. అని రాసి ఉంది.. సిరాకలంతో.. బుక్ పేరు 'హి హూ రైడ్స్ ఎ టైగర్'.

అక్షరాలను నును వ్రేళ్ళతో తడిమాడు.. మనిషినే స్పర్శిస్తున్న అనుభూతి.. ఏదో విద్యుత్తు నరనరాల్లో ప్రవహిస్తున్న జలదరింపు. లోపల పేజీల్లో వేరెవరో పెన్సిల్‌తో రాసిన వ్యాఖ్యలు బెంగాలీలో.

"అక్షరాలు పాతబడ్తాయా అపర్ణా" అన్నాడు చటుక్కున అనూహ్యంగా.

ఆమె తలెత్తి చూచి.. నవ్వుకుని.. ఆమె చూపులనిండా.. ఒట్టి ప్రేమ.

రెండు గంటలు గడిచాయి.. అఫ్ఘన్ చికెన్.. టీ,

ఇండియన్ కాఫీ హౌజ్‌ను అణువణువూ తిప్పి తన అటాచ్‌మెంట్‌నంతా

విప్పి చెబుతూ.. దిగి.. ఒక ఫర్లాంగ్ నడిచి.. థియేటరొకటి.. పాతది..'రూపం సినిమా'.

పథేర్ పాంచాలి.. ఆ ఒక్కరోజు కోసమే ప్రదర్శన.. సత్యజిత్ రే ది.

వెళ్ళి రెండు టికెట్లు తెచ్చాడు.. ఇరవై ఐదు రూపాయలే ఒక్కొక్కటి.

నలుపు తెలుపు సినిమా అది. ఇదివరకు తామిద్దరూ ఎన్నోసార్లు చూచిందే.. కాని.. "మనం ఆకాశాన్ని ఎన్నిసార్లు చూచినా తనివితీరదు కదా అపర్ణా" అన్నాడు శరత్ చెవిలో మెల్లగా చీకట్లో సినిమా చూస్తున్నపుడు.

శరత్ హృదిలోని కల్లోల అంతరంగం బోధపడుతోంది అపర్ణకు.

రెండు గంటల తర్వాత.. సినిమా టాకీస్ వదిలి బయటికొచ్చి.. మధ్యాహ్నం రెండు దాటిందేమో అప్పటికి.. వర్షం ప్రారంభమైంది సన్నగా.. జల్లు.

అప్పుడు కనిపించాయి.. కాలేజ్ స్ట్రీట్‌లో నాల్గయిదు క్రేన్స్.. ఎర్త్ మూవర్స్.

ఆ నాల్గయిదు గంటల్లోనే కిలోమీటరున్నర పొడుగున్న పుస్తక దుకాణాలన్నీ మూతబడ్డాయి.. అంతా విషాద నిశ్శబ్దం గాఢంగా అలుముకుపోయి ఉంది. ఎవరో చనిపోతే ఏర్పడే నిశ్శబ్ద శూన్యం.. అంతా దీనంగా, దుఃఖంగా.

కొందరు నల్లని కోట్లు ధరించిన లాయర్లు.. మరికొందరు కలకత్తా మునిసిపల్ కార్పొరేషన్ అధికారులు.. మిగతా.. పెద్ద సంఖ్యలో పోలీసులు.

గత కొద్ది రోజులుగా పత్రికల్లో, మీడియాలో వస్తున్న వార్త జ్ఞాపకమొచ్చింది శరత్‌కు.. హైకోర్ట్ సూచనల మేరకు ఈ చారిత్రాత్మక కాలేజ్ స్ట్రీట్ బుక్ స్టాల్స్ అన్నింటినీ నేలమట్టం చేసి 'షెల్టర్ హౌసింగ్ డెవెలప్‌మెంట్ లిమిటెడ్' మరియు 'కలకత్తా మునిసిపల్ కార్పొరేషన్' సంయుక్తంగా గత వైభవానికి ఏ మాత్రం భంగం వాటిల్లకుండా.. మిలియన్ చదరపు అడుగుల విస్తీర్ణంతో 'వర్ణ పరిచయ్' పేరుతో ఒక పుస్తక మాల్‌ను నిర్మించి భవిష్యత్ తరాలకు అందించాలని.

అందుకే ఈ డిమాలిషన్ ప్రక్రియ ఇప్పుడు.

ఈ సంగతి తెలిసే దశాబ్దాల బంధాన్ని కలిగిఉన్న ఈ కాలేజ్ స్ట్రీట్‌ను కడసారి దాని సహజ రూపులో చూచుకుందామని.. రావడం.. పిడికెడు గుండెలో దాగి ఉన్న కోటి కోటి జ్ఞాపకాలను ఒక్కసారి తవ్వి తలచుకుని .. బరువెక్కిన హృదయంతో,

వర్షం పెరిగి ఉధృతమౌతూండగానే,

ఎవరో ఒక రాజకీయ నాయకుడు ఓ కొబ్బరికాయ కొట్టాడు రాయిపై. వెంటనే ఒక ఎర్త్ మూవర్.. జెసిబి తన ఇనుప చేతిని ఆకాశంలోకి ఎత్తి భూమిని ఒక్కసారిగా పెకిలించింది. ముందు కొసకున్న నూటా నలభై సంవత్సరాల 'రహీం బుక్ స్టాల్' ఒక్కసారిగా నేలమట్టమై.. అక్కడ నేల ఓ పెద్ద బొరియలా ఏర్పడింది.. ఒక టన్ను మట్టి ఇనుప చేతిలోకి వచ్చి ప్రక్కనున్న డంపర్లోకి మారింది. చీకటి పడ్తూండగా.. అన్నీ ఎర్త్ మూవర్స్.. క్రేన్స్.. డంపర్స్.. హెవీ డ్యూటీ లారీలు.. పదుల సంఖ్యలో.. ఒళ్లంతా లైట్ల కళ్ళు చేసుకుని.. రేయింబవళ్ళు ' డిమాలిషన్'.

డిమాలిషన్ జరుగుతున్న ఘటనను అతి విషాదంగా చూస్తూ వందల సంఖ్యలో జనం.. గాలినిండా గడ్డకట్టిన నిశ్శబ్ద దుఃఖం.

ఏడెనిమిది తరాలను ప్రభావితం చేసిన ప్రపంచంలోనే అతిపెద్ద సెకండ్ హ్యాండ్ పుస్తక క్షేత్రం.. కనుమరుగౌతూ,

చరిత్ర ఎప్పుడూ కాల గర్భంలో క్షిప్తమైపోతూ.. భూపొరల్లో సమాధై.. అంతరించిపోతూ.. తన ఉనికిని కోల్పోయి.. దొంతరలు దొంతరలుగా మనుషుల హృదయానుభూతులను కేవలం జ్ఞాపకాలుగా మిగిల్చి కనుమరుగైపోవలసిందేనా? పాత ఒక గతమై.. కొత్త ఒక ప్లాస్టిక్ పుష్పం వలె.. విప్పారి.. 'వాసనలేని పువ్వు.. బుధవర్గము లేని పురంబు..' లా.. నాల్గయిదు తరాలుగా వందలమంది ఆ స్థలంలో దాచుకున్న తమ జీవితకాల అనుబంధాలను కోల్పోయి.,

అభివృద్ధి.. వికాసం.. ఆధునికమౌతున్న నాగరికత.. సౌకర్యవంతమైన జీవిత రూపకల్పన.,

ఇదేనా.

ఒక నిర్మాణం జరుగాలంటే ఒక విధ్వంసం తప్పదా?

ఆ నూటా యాభై ఏళ్లనాటి రావిచెట్టు కింద నిలబడి మౌనంగా ' డిమాలిషన్' కార్యాన్ని వీక్షిస్తున్న శరత్.. పూర్తిగా వర్షంలో తడిచి ముద్దయ్యాడు. అపర్ణ కూడా.. ఓ గంట తర్వాత.."వెళ్దాం పద అపర్ణా.. నాకిప్పుడు.. శ్మశానంలో చితి అంటించిన తర్వాత వెనుదిరిగి కూడా చూడకుండా వెళ్తున్న దుఃఖితునిలా అనిపిస్తోంది" అన్నాడు శరత్.

అపర్ణ శరత్ ముఖంలోకి దీనంగా చూచి.. కదిలిందక్కడినుండి.. చీకటి.. వర్షం.. చిక్కనౌతూండగా.

అంతా కన్నీటి తడి.. వర్షపు తడి.. లోపలా.. బయటా.

ఆ క్షణం.. 'ఇండియన్ కాఫీ హౌజ్' దగ్గరకు క్రేన్ జా ఒకటి చేరువౌతోంది మెల్లగా.. కూల్చేందుకు.. నేలమట్టం చేసేందుకు.

❄ ❄ ❄

మనుషుల జీవితాలు కూడా చివరికి కేవలం జ్ఞాపకాలుగా మాత్రమే మిగిలే అనుభవాలేనా.

తన బాల్యం.. హైదరాబాద్.. బెంగాలీ సాహిత్యానీ.. అందులో శరత్ రచనలనూ ఇష్టపడే నాన్న.. తనకు పెట్టిన పేరు శరత్.. చదువు.. జీవిత రూపురేఖలు ఏర్పడ్డది.. బెంగాల్‌లో. వ్యక్తిత్వ నిర్మాణం.. అంతా హైదరాబాద్.. వారణాసి నుండొచ్చిన రేవతి భార్య.. పుట్టిన కూతురు రాధిక .. అక్కడెక్కడో అమెరికాలో.,

మనుషులు కలిసి .. విడిపోతూ.. కూర్చబడ్తూ.. అంతరించిపోతూ.. జ్ఞాపకాలై మిగిలిపోతూ,

ఒంటరితనం.. ఒక అనివార్యతై.. నీటిపాయలా ప్రవహిస్తూన్నపుడు.. ఎక్కడినుండో మరో నీటిపాయ.. అపర్ణ.. వచ్చి కలిసి,

కలయికలన్నీ భౌతిక విలీనతలే కానవసరం లేని ఒక తాత్విక సంలీనతలో,

విస్మృతి.. విశాలత.. అతీతత.. ఆత్మానుశీలనతో కొత్త చూపు నలవర్చుకుంటూ.. 'విత్.. విథౌట్.. విథిన్'ల మీమాంస.

మనిషి మరో మనిషితో సంలీనం కావాలంటే.. భౌతిక బంధాలే అవసరమా?

ఆ లెఖ్ఖన ఈ అపర్ణ ఎవరు?

ఆమె గురించి తనకు తెలిసింది చాలా తక్కువ.. ఆమె కేవలం ఒక రైటైర్డ్ ప్రొఫెసర్ అని మాత్రమే తెలుసు.. పరిణతి చెందిన మనిషి.. అంతే. మిగతా వివరాలు తనకనవసరం.

"శరత్.. వచ్చే ఇరవై ఐదో తేదీన జర్మనీలో ఉండే నా కొడుకు దగ్గరికి వెళ్ళిపోతా నేను" అని అంది అపర్ణ గత వారం తనతో.

నిజంగానే వెళ్ళిపోతుందా?

వెళ్లిపోయి తాను కూడా ఒక జ్ఞాపకంగా మిగిలిపోతుందా?

అసలు నిజానికి తానెవరు.. ఈ అపర్ణ ఎవరు?

ఆమెకు తను.. అంతిమంగా ఒక జ్ఞాపకం.. తనకు ఆమె కూడా చివరికి మిగిలిపోయే ఒక జ్ఞాపకమేనా.. కాలేజ్ స్ట్రీట్ వలె.. వందల ఏళ్ల ఉనికి.. కాల గర్భంలో కలిసిపోయింది కదా.

రేపు ఏ మనిషైనా అంతేనా!

విమానం అర్థరాత్రి కలకత్తా నుండి బయలుదేరి హైదరాబాద్ వెళ్తోంది. అందరూ నిద్రపోతున్నారు వాళ్ళ వాళ్ళ సీట్లలో.

కాని తనకు మాత్రం నిద్ర రావడంలేదు.. జ్ఞాపకాల భారం.

ప్రక్కకు చూస్తే.. అపర్ణ.. తన భుజంపై తల వాల్చి నిద్రపోతోంది.. ప్రశాంతంగా.

ఆమె ముఖంలోకి చూశాడు. నిర్మలంగా ఉంది ఏ మబ్బూ లేని ఆకాశంలా.

కళ్ళు మూసుకున్నాడు శరత్.. లోపల వర్షం.. సన్నగా.. ముసురు.